జరగదగిన పరిణామాలలో ఏ ఒకటీ జరగదు.

గణపతికీ చంద్రానికీ మధ్య గల వైరం—కనీసం వైరుధ్యం-కథను నేరుగా ఉపయోగించుకో బడలేదు. అసలు వీరిద్దరూ ముఖాముఖీ తలపడరు. ఇది కథకు చాలా పెద్దలోపం. ఆఖరుకు గణపతి ఆట కట్టయిన సమయానికి అందులో చంద్రం నిర్వహించినపాత్ర ఉన్న మొత్తంలేదు.

ఇంకా చిల్లరలోపాలు ఎన్ని ఉన్నప్పటికీ ఈ చిత్రం వాస్తవిక పాత్రలనూ, అకృత్రిమ సన్నివేశాలనూ, ప్రజల యధార్థ కష్టసుఖాలనూ ప్రేక్షకులకు అందజేస్తోంది. దర్శకత్వంలోనూ, ఫోటోగ్రఫీలోనూ, సంగీతంలోనూ చాలా సుగుణాలున్నాయి. ఇకముందు ఏపుబ్సువారు ఇంకామంచి చిత్రాలు తీస్తారనే ఆశ కలుగుతోంది.

అంతర్యంలో రెండూ ఒకటే: అయితేనేం—

# సత్రపు చావడి: పురమందిరం

కొండూరి నరసింహం

ప్రభుత్వానికి, ప్రజలకు కూడా యధార్థ దృష్టి నశించింది. ఉభయులనూ కూడా కొద్దిలేని అంధకారమేదో చుట్టబెట్టుకుంది. రెండుపక్షాలు పద్ధతులులేని ప్రణాళికలలో, పరువులేని భావాలలో సతమతమవుతూన్న సంగతిని సత్రపుచావడి సాంకేతిక సంఘ సభ్యులమైన... కిర్లికొట్టు శ్రీరామమూర్తి, ఫోటోగ్రాఫరు అప్పారావు, సైకిలు షాపు కామేశమూర్తి, పొగాకు వీరన్న, నాటకకవి నరసన్న, పేకాట పొనుగుడు కాసు ముత్యాలు, వెల్కం సర్వరు గురవయ్య, మిల్లు కూలీ మేస్త్రీ సత్తెం వగైరా పదహారుగురు ఏకస్థులమై ప్రపంచానికి తెలియచేయదలచాము. కారణము లేయని కలుష వాతావరణము మమ్ములను కళాకారులనుగా గుర్తించ తిరస్కరించింది. పగలంతా ఎవరి వృత్తులలో వారు శ్రమపడుచున్నను సంధ్యాంతర సమయంలో సత్రంలో సమావేశమవుతూన్నం. నాటకాన్నొకదాన్ని నాణెంగా ప్రదర్శించి నవకళాభ్యుదయ భవనానికి పునాదులు వేయాలని అభిలాషతో ఐక్యమయిన మా సంఘం పేకాట కూడా నాగరక లక్షణమని గుర్తించి దాన్ని యథోచితంగా సేవిస్తోంది. ఆ ఆటలో డబ్బు పెట్టిననేకాని సరియైన సంతోషం కలుగదని సత్యమెరిగిన మేము స్వార్జిత విత్తాన్ని కాసీ మేజు లగాయతు రూపాయలు మేజు వరకు పెంపుదల ఆయా సమయములలో చేసికొనుచు నిర్వహించుకొనుచున్నాము. అగుచో మాపైన ఆ సంతులు హెడ్డుగారికిగాని, ఆ నాయరు సబ్ఇనస్పెక్టరుగారికి గాని ఆగ్రహం కలగడానికి కారణం ఏమిటి? అందుచే మాకళాపోసన భంగమందుచున్నది. తత్సందర్భంలో పసిగ కళాపోసకుల సంఘ సమావేశ భవనాలను గురించి మేము ఆరాతీయక తప్పదుగా...

సదరు పట్టణంలోనే... ప్రభుత్వోద్యోగులు, ప్రయివేటు వకీళ్లు, కాలేజీ ప్రొఫెసర్సు, కంట్రాక్టరు స్వాములు, ఫ్యాన్సీషాపు ప్రొప్రయిటర్లు, ఫ్యాషనుబుల్ లేడీస్... అందరూ పొగడదగిన పురమందిరము శాశ్వత భవనమున్నది. రూపభేదమేకాని క్రియాచరణలో మా సత్రపు చావడి సంఘానికీ దానికీ తేడాలేదు. అంతకూ ఆరా తీస్తే సంఘసేవ విషయంలో మా సభ్యులే ముందడుగు వేశారని చెప్పవచ్చు. క్రితం సంవత్సరం వరకు మేము శ్రీరామనవమి ఉత్సవాలను నడిపేము. ప్రయాణపు ఖర్చులు, పప్పన్నముతో తృప్తిపడలేని స్వార్థపరులైన గాయకులు, హరిదాసులు మా సేవను గుర్తింపక పోవడముతో ఉత్సవాలు కట్టిపెట్టాము. మాలో ప్రతియొకడు కరువునిధులు వసూలుచేయడంలో మొనగాడు. క్వాచిత్కంగా దేశ మొత్తముమీద కరువు ప్రాంతం లేకపోయినా, భవిష్యత్ క్షేమనిధిగా మాసంఘం నిధికి డబ్బాలు తిప్పుతూనే ఉంటుంది. అటువంటి ప్రజాసేవ ఆ పురమందిరంవారు కలలో కూడా తలపెట్టరు. జూదమనేది రహస్య ప్రదేశాలలో ఆడే డబ్బాటకు పేరని, పురమందిరంలో బహిరంగంగా కలర్సుత్రాగుతూ కాన్ఫైసన్సు

కాలుస్తూ ఆడితే జూదమనిపించుకోదనీ ఏ నిఘంటువులో ఉన్నదో మాకు కనిపింపలేదు. మొన్న నీ మధ్యనే పబ్లికు ప్రాసిక్యూటరుగారు బేస్తులో పదిహేనురూపాయలు కుదేలై పంచిపెట్టారని సింగపూరు ప్లీడరుగారు (ఆయన సింగపూరు నుంచి రాలేదు. ఈయన పట్టా పుచ్చుకొని కొత్తగా కోర్టులో అడుగు పెట్టిననాడే సింగపూరు పతనమయింది) ఢంకా బజాయింపులో డైలీ ట్వంటీరూపీసయినా సంపాదిస్తారనీ, లెక్చరరు రాచప్పగారికి పట్లాటచేత కాకపోయినా, బ్రిడ్జి ఆడి జేబుకు చిల్లుకొట్టుకున్నారని, ఫ్యాన్సీ షాపు ప్రొప్రయిటరు చీకటి బజారులో చేతికి ఉంకించుకొన్నదంతా చీట్లాట సభ్యులకు పంచిపెట్టే ఉదారుడని మా సంఘం సభ్యులకేకాదు మా పట్టణ పౌరులందరకును తెలుసు. టెన్నిస్ వగైరా పోటీ ఆటలకు ఈ నాగరకులు ఖర్చుపెట్టే మొత్తాలు వసూలుచేస్తే రాయలసీమలాటి రాళ్ళజిల్లాలను బంగారపు భూమిగా మార్చివేయగల పనులను చేయించవచ్చును. నవనాగరికులమనేవారు అలా ఉంటే...ఆ పురమందిర సభ్యులైన పోలీసు సిబ్బందివారు (ముఖ్యులు లెండి. కానిస్టేబిల్సు మాజోలికిరారు. వారు స్వల్పంతో సంతృప్తిపడగలరు.) మా సత్రపుకూటముకు ముట్టడించి మమ్ములను నిర్బధించి నిలదీయడములో న్యాయమేమున్నది? టౌనుహాలులో ఖర్చయినన్ని పేకలు, కాల్చబడినన్ని సిగరెట్లు, వెలిగినన్ని దీపాలు, ఉన్నంతమంది నౌకర్లు మా సంఘంలో ఉండవనేగా పోలీసువారి యీ దౌర్జన్యము. కోర్టు మునసబుగారు మూడుముక్కలాటలో పెద్దచేయి అన్నది ప్రశస్తిఆయి, పోగాకువీరన్న సెట్లు ఆడడంలో ఆరితేరినవాడన్నది అప్రశస్తి ఎలా అవుతుందో కించిజ్ఞులమైన మాకు తెలియకుండా ఉన్నది. నవమినవరాత్రుల తదనంతరము మేము చేసినన్ని ఫ్రూటు ఫీడింగ్సు, పురమందిర సభ్యులెన్ని చేశారో ఆరా తీయండి. మేము స్వంతంగా నాటకమాడుకొని, మా సంఘాన్ని బలపరచుకొందామని ప్రయత్నిస్తే ఒక్క పెద్దమనిషీ టిక్కెట్టుకొన్న పాపాన్ని పోలేదు. టౌనుహాలు ఫండుకోరకుమాత్రం పెద్ద కంపెనీలవారి నాటకం బెనిఫిట్...కమిషనరుగారు వగైరాలంటకట్టిన టిక్కెట్లకు 10లు, 15లు పలువురు చెల్లించుకొన్నారు. పోనీ ఇన్నీ సంవత్సరాలనుండి కృషిచేసినా పురమందిరసభ్యులలో చక్కని ఆటగాళ్ళు సృజింపబడి యితరులకాదర్శమైనారేమో అంటే అదీశూన్యం. మా సభ్యులలో ఎవరైనా సరే మాచుకోండి... పేకాటలో పేచీరాయుళ్ళే. ముత్యాలు పేక కలిపివేశాడా జోళ్లు, కలర్లు, ఢంకాలు, ముళ్ళడిపోతాయి... ఆటో గ్రాఫరు అప్పారావు పందెం పాట మొదలుపెట్టాడా, మా డాసులవాడు తప్పుకోవలసిందే. ఒక రూపాయతో రంగంలోకి వచ్చి పదిహేను రోజుల సాదరుకు సంపాదించుకోగలిగిన ప్రజ్ఞగలవాళ్లు మా సంఘంలో ఎందరో. చెప్పవచ్చేదేమంటే, నేర మనేది అందరికీ సమానమే. దానికి శిక్షా స్వరూపమూ అంతే. కాబట్టి పురమందిరములోని జూదపాటల విషయంలో ధృతరాష్ట్రులైనవారు మా సత్రపుచావడుల సమావేశాలలో జోక్యం కలిగించుకోవడం పచ్చి అన్యాయం.

దేవాదాయాలకు దేశ సౌభాగ్యంకోసం వినియోగించాలని నినాదాలిచ్చే వారు పురమందిరాలకు వృధా ఖర్చయే ధన ప్రవాహాన్ని అరికట్టే ప్రయత్నం చేయాలి. నైతికవర్తనలో పరివర్తనము రావలసినది ఒక్క రహస్య జూదరుల విషయంలోనే కాదు. పెద్ద దుస్తుల ప్రభుత్వోద్యోగుల దుర్వ్యసనాలలో కూడా. పురమందిరములలో వీరవిహారము చేసే ప్రొఫెసర్లు విద్యార్థుల నైతికాభివృద్ధి కెలా తోడ్పడుతారో విచారించండి. ఈ యథార్థములను మా సంఘసభ్యులలో ఎవరైనను ఎప్పుడైనను రుజువుచేయగలరు. కాబట్టి, ప్రభుత్వామికనైనా మా సత్రపు చావడిని సత్సమావేశ భవనముగా గుర్తించుగాక! మరియొక ముఖ్య విషయము. మా సత్రపుచావడి అనేకులైన అనాథులకు ఆశ్రయమిచ్చేది. దాన్ని మే మెప్పుడు కాదనలేదు. అనేకమంది కాందిశీకులు అలో లక్ష్మణాయని ఆలాపిస్తూంటే ఈ పురమందిరాలు క్షణకాలమైనా తల దాచుకోనిస్తాయా? ఆ సభ్యులూ అట్టివారే. ఆ మందిరాలూ అటువంటివే. దేశీయ క్రీడలకైనా అవి స్థానం కాలేకపోయినాయి.

లోకం యథార్థాన్ని ముందు గుర్తించాలి.

(8-వ పేజీ తరువాయి)

ఆ దేశంలోని శాస్త్రజ్ఞుల మహాసభకు పోయి వారి పరిచయం చేసుకున్న డాక్టర్ భట్నగర్ రష్యను మేధావులు యుద్ధ పిపాసులు కారనీ, వారూ శాంతి ప్రియులే అయినప్పటికీ వారి దేశంమీదకు శత్రువు వస్తే మాత్రం తీవ్రంగా ఎదుర్కొంటారనీ చెప్పేరు. రష్యను శాస్త్రజ్ఞులు వివిధ శాస్త్ర పరిశోధన చక్కగాచేసి బాగా విజ్ఞానాన్ని పెంపొందించుకున్నారని, వారికి అవకాశాలు బాగా ఉన్నాయనీ ఆయన స్పష్టీకరించారు. కనుక కమ్యూనిస్టు వ్యతిరేకులంటూ బయలుదేరిన బుద్ధిమంతులు, మన దేశంలోని కమ్యూనిస్టు "నూతన వైష్ణవులను" చూచి మానవ సౌఖ్యంకోసం ఒక బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్వహించి అనేక విజయాలను సాధించిన రష్యానుకాని వారి రాజకీయ సిద్ధాంతాలను కాని తేలికగా నిరసించడం తగ్గించాలి. భారత దేశంలో గాంధీ అనంతరం గాంధి తత్వం మరుగు పడినట్లే రష్యాలో కూడా లెనినిజం మరుగుపడితే మరుగుపడి ఉండవచ్చు. కొత్తగా బయలుదేరిన స్టాలినిజం ఆ ప్రజలకు ప్రమాదకరమైతే వారే తోసేస్తారు. జారు ప్రభుత్వాన్ని ప్రతిఘటించిన ప్రజలు అంతకన్న ఎక్కువ నిరంకుశత్వాన్ని భరిస్తారా?

# ఆంధ్రలో జాతీయోద్యమం: ప్రజాస్వామ్యం

"నాగానంద"

ఆంధ్రజాతీయోద్యమంలో కులతత్వం ప్రవేశించడమే కాక ప్రజాస్వామ్యం అనేది నామమాత్రం కావడంవల్లకూడా ఆ ఉద్యమానికి ప్రతినిధిగావున్న కాంగ్రెసు సంస్థ దెబ్బతిన్నది.

కాంగ్రెసులో ప్రజాస్వామ్యాన్నిగురించి పరిశీలించ దలచినప్పుడు, కాంగ్రెసు సంఘాలలో ప్రజాస్వామ్యం, కాంగ్రెసు ప్రభుత్వాలలో ప్రజాస్వామ్యం అనే విభాగాలను చేయవలసివుంటుంది. ముందుగా కాంగ్రెసు సంఘాలలో ప్రజాస్వామ్యాన్నిగురించి పరిశీలిద్దాం.

కాంగ్రెసు సంస్థను పెంచిపోషించిన ఆంధ్ర పెద్దలు కేవలం అరడజనుమందివున్నారు. వారు తమ తరంలో కొంతమంది యువకులను ప్రతి జిల్లానుంచి సమీకరించి జాతీయ వాదులుగా తయారుచేశారు. ఇంగ్లీషు చదువులు మాన్పించారు. ఖద్దరు కట్టించారు. జైళ్లకు పంపించారు. సభలు సమావేశాలలో ముందువుంచారు. ఈ విధంగా యువక నాయకులను తయారుచేసి ప్రజలకు యిచ్చారు.

ఆ యువక నాయకులు పెరిగి పెద్దవారై ప్రజల అభిమానాన్ని చూరగొనే సమయం వచ్చేటప్పటికి దేశంలో రాజకీయమైన మార్పులు వచ్చినవి. పదవులను స్వీకరించవలసినదశ వచ్చింది. ఆ నాటినుండి ఉద్యమస్వభావంలో మార్పువచ్చింది అధికారవాంఛతో వ్యక్తిగతమైన పరువు ప్రతిష్ఠలను ఈ నాయకులు పెంచుకొన్నారేకాని వారంతా ఒక సంస్థను అభివృద్ధిచేయాలనే ఆలోచన చేయలేకపోయారు. దీని ఫలితంగా గ్రామ కాంగ్రెసు సంఘం మొదలు రాష్ట్ర కాంగ్రెసు సంఘం వరకు గల పదవులు ఆయా జిల్లాలోని పెద్ద నాయకులు చెప్పినట్టు కట్టిపెట్టడంతో కాంగ్రెసు సంఘాలలో ఎన్నికలనేవి కొంతకాలం వరకు జరగవలసిన అవసరమే లేకపోయింది. తీరా జాతీయవాదులసంఖ్య పెరిగి కార్యవర్గాలఎన్నికలు జరపవలసిన స్థితి వచ్చేటప్పటికి అసలు కాంగ్రెసు సభ్యులెవరనే వాదన బయలుదేరింది. చివరకు ఈ కాంగ్రెసు సభ్యులనే వారిలో చాలామందికి కాంగ్రెసు భావాలుకూడా లేవని నిరూపించడం జరిగింది. ఈ విధంగా కాంగ్రెసు సంస్థ పునాదులకే మోసం వచ్చింది. ఇందుకు నిదర్శనం ఆంధ్ర కాంగ్రెసుకమిటీలో ప్రాథమిక సభ్యుల జాబితాల అల్లర్లను ఉదాహరణగా చెప్పవచ్చు.

అంతేకాదు. కాంగ్రెసుకమిటీ ఎన్నికలనే కాంగ్రెసువాదులు న్యాయంగా జరుపుకోనేరని స్పష్టపడింది. ఇలాంటివారు న్యాయంగా పరిపాలించగలరా అనే భావంకూడా కొందరిలో కలి